క్లుప్తంగా

మాంసం దుకాణాల తనిఖీ

సాలూరు: పట్టణంలోని పెదబజారులో గల మాంసం దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. సుమారు 10 కేజీల పాడైపోయిన మాంసాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఆ మాంసాన్ని డంపింగ్‌యార్డు వద్ద పాతిపెట్టించారు.

చెత్త తరలింపు

అలాగే బైపాస్‌రోడ్డు వద్ద వేసిన చెత్తతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ చెత్తను పాత డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. బైపాస్ పక్కనే చెత్త వేయడం వల్ల వెలువడే దుర్గంధం, కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే.

మృతుడి కుటుంబానికి ఆర్థికసహాయం



మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భార్యకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించిన మావుడి రంగునాయుడు

మక్కువ: మండలకేంద్రం మక్కువకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కిల్లంపూడి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు బుధవారం స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్ద శ్రీనివాసరావు భార్య భారతికి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు రూ.15వేలు ఆర్థిక సహాయం చేశారు. ముల్ముందు మీ కుటుంబానికి అండగా ఉంటామని, ఏసహాయం చేసేందుకైనా పార్టీ తరపున అండగా ఉంటామని రంగునాయుడు భరోసా కల్పించారు.

ఎంపీడీఓగా కె. సత్యం



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కె.సత్యం

పార్వతీపురం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా కె.సత్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీతంపేట డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై పార్వతీపురం ఎంపీడీఓగా రాగా, ఇంతవరకు పార్వతీపురం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన జి.రమేష్ బాబు కురుపాం ఈఓపీఆర్‌డీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎంపీడీఓకు మండల పరిధిలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



ప్రైమరీ మోడల్ పాఠశాలలో స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని కాశీపట్నం ప్రైమరీ మోడల్ పాఠశాలలో బుధవారం హెచ్ఎం శంబంగి శ్రీనివాసరావు విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు, పాఠశాలలో స్వచ్ఛత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్ఎంసీ, ఎస్ఎండీసీఎస్, పీటీఏఎస్ సమావేశాలు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వర్షపునీటి సంరక్షణ పద్ధతిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ చక్కగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఆర్‌టీలకు అన్యాయం చేయొద్దు



పీఆర్‌టీయూ సభ్యత్వంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మక్కువ: సీఆర్‌టీలకు ప్రభుత్వం అన్యాయం చేయకుండా, వారికి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ మన్యం జిల్లా ప్రెసిడెంట్ ఓలేటి తవిటి నాయుడు కోరారు. ఈ మేరకు మక్కువ మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమపాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న, 1240మంది సీఆర్‌టీల మనోవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌టీల సేవలను ప్రభుత్వం గుర్తించి, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కేజీబీవీల ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలు విడుదలచేయడంలో ఆలస్యమవుతున్నందున అనేక ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకోసం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు చింతాడ అప్పారావు, ఎం.సత్యనారాయణ, ఎం.వెంకట్రావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన అంతేనా..!



మధ్యలో నిలిచిపోయిన సాంపిగాం వంతెన పనులు



నిధులు వెనక్కు మళ్లడంతో నిర్మాణానికి నోచుకోని దండిగాం వంతెన పరిస్థితి



వేగావతి నదిపై శివరాంపురం వద్ద నిలిచిపోయిన వంతెన పనులు

- నిలిచిపోయిన పనుల ప్రారంభం ఎప్పుడో?
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు మైదాన ప్రాంతాలకు వారి అవసరాల రీత్యా చేరాలంటే గెడ్డలు, వాగులు దాటాల్సిందే. అయితే గత ప్రభుత్వంలో దాదాపు సాలూరు ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ముఖ్యమైన నదులపై వంతెనల నిర్మాణాలకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో నిధులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో దశాబ్దాలుగా గెడ్డలు దాటేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొన్ని వంతెనల నిర్మాణంతో కొంత ఊరట కలిగింది. అందులో ముఖ్యంగా కందులపథం వంతెన. ఈ వంతెన నిర్మాణంతో మైదాన ప్రాంత గ్రామాలతో పాటు ఏజెన్సీ గ్రామాల ప్రజలకు వంతెన కష్టాలు తీరాయి. అలాగే వేగావతి నదిపై పాచిపెంట మండలంలోని గ్రామాలకు చేరేందుకు కాజ్‌వే ఉండేది. ఆ కాజ్‌వేపై నదిపొంగే సమయంలో వాహనాలు, మనుషులు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. అక్కడ వంతెన నిర్మాణంతో పలుగ్రామాల ప్రజలకు కష్టాలు తీరాయి. శివరాంపురం వంతెనకు గత ప్రభుత్వంలో రూ.5.90 కోట్ల నిధులు మంజూరు చేయగా ఇప్పటివరకు ఆ పనులు ప్రారంభించలేదు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రస్తుత మంత్రి సంధ్యారాణి అధికారంలోకి రాగానే వంతెన పనులు పూర్తిచేస్తామని హామీఇచ్చి ఇప్పటికీ ఆ ఊసే ఎత్తడం లేదు. అలాగే పారన్నవలస గ్రామం చుట్టూ నీరు మధ్యలో గ్రామం ఉంటుంది. ఈ గ్రామానికి వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతాయి. దీనికి కూరగెడ్డపై వంతెన పనులు గత ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. ఎన్నికల కారణంగా నిలిచిపోయిన పనులు ఇప్పటికీ ప్రారంభించలేకపోతున్నారు.

పట్టించుకోని మంత్రి సంధ్యారాణి

అలాగే దండిగాం వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.11 కోట్లు మంజూరు చేశారు. అయితే ఆ నిధులు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెనక్కుమళ్లాయి. అలాగే సాంపిగాం గెడ్డపై వంతెన పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పటికీ పనులు ప్రారంభించాలన్న ఆలోచన కూడా చేయకపోవడం విచారకరం. ఎన్నికల సమయంలో గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి గిరిజన గ్రామాలకు రహదారులు వేయిస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు కనీసం వంతెనలు కాదుకదా రహదారుల నిర్మాణాలకు కూడా చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్వస్థ్‌నారీ స్వశక్తి కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలి

- జిల్లా ఉపవైద్యాధికారి డా.కేవీఎస్ పద్మావతి



స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి డా.కేవీఎస్ పద్మావతి

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల తాళ్లబురిడి ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కేవీఎస్ పద్మావతి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఓపీలతో పాటు ఎన్‌సీడీ సర్వే, మరికొన్ని రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు చేశారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడీలు క్రియేట్ చేయాలని సూచించారు. గర్భిణుల్లో ఎనీమియా కేసుల తగ్గుదలకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి



పెదపెంకిలో ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించిన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలలో మంచి నాణ్యమైన విద్యను అందించి వాటిని అభివృద్ధి చేయాలని బలిజిపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన పెదపెంకిలో ఉన్న మూడు ప్రాథమిక పాఠశాలలను బుధవారం పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, తరగతుల పరిశీలన, విద్యార్థుల నైపుణ్యాలు, హ్యాండ్ బుక్స్, విద్యార్థుల అసెస్‌మెంట్ పుస్తకాలను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను గమనించారు. తరగతి గదిలో ఉండే విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారినుంచి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. సిలబస్ సకాలంలో పూర్తిచేయాలని, వర్క్‌బుక్‌లను పూర్తిచేయించాలని తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో సీఆర్‌టీ సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సకు 51 మంది ఎంపిక



కంటి శస్త్రచికిత్సకు పయనమైన రోగులు

సీతానగరం: పీహెచ్‌సీ వైద్యాధికారుల పర్యవేక్షణలో శంకర్‌ఫౌండేషన్ అంధత్వ నివారణకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవడం అభినందనీయమని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఆమె మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో కంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలియజేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సహకారంతో స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన శిబిరంలో 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. శంకర్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ 86 మందికిగాను 51 మందికి శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించామని తెలియజేశారు.17 మందికి ఉచితంగా కంటి అద్దాలు తయారుచేసి ఇవ్వనున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ సహాయకుడు దీపక్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రపంచపు తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ



పార్వతీపురం రూరల్: విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు



సాలూరు: పట్టణంలో నిర్వహిస్తున్న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



పార్వతీపురం టౌన్: పట్టణంలో విశ్వకర్మ జయంతి మహోత్సవాలు

- ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి

పార్వతీపురం రూరల్: శిల్పకళ, వాస్తుశాస్త్రం, యంత్ర సాంకేతికానికి ప్రతీక అయిన దేవశిల్పి శ్రీ విశ్వకర్మ జయంతి సందర్భంగా, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాల వేసిన ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి మరికొంత మంది పోలీస్ అధికారులతో కలిసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. కృష్ణుడు పాలించిన ద్వారకానగరం వంటి పలు నగరాలు నిర్మించినట్లు పురాణాల్లో ఉందని, విశ్వకర్మ గురించి విస్తృతమైన విషయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సూపరింటెండెంట్ శంకర రావు, ఎస్బీ, డీసీఆర్బీ, సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లా వెంకయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మిద్దాం



కొల్లా వెంకయ్య వర్ధంతి సభలో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా సమితి సభ్యులు

పార్వతీపురం టౌన్: కొల్లా వెంకయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మిద్దామని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సభకు ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో జాతీయస్థాయిలో సిద్ధాంత ,రాజకీయ, ఆచరణ వ్యక్తిత్వం కలిగిన, విశిష్టత కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు కొల్లా వెంకయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బి.మోహన్ రావు, ఎ.సీతమ్మ, జి.రామ్మూర్తి, బొత్స మోహన్ రావు, చిరంజీవి, పి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శిర్లాం మాజీ సర్పంచ్‌కు నివాళులర్పించిన రాజన్నదొర



మాజీ సర్పంచ్ జగన్నాథం చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న రాజన్నదొర, మావుడి సోదరులు

మక్కువ: మండలంలోని డి.శిర్లాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గేదెల జగన్నాథం వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు బుధవారం కుటుంబసభ్యులు చేపట్టిన పెద్దకర్మ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ వింగ్ నాయకుడు మావుడి తిరుపతినాయుడులు హాజరై జగన్నాథం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళలర్పించారు. జగన్నాథం కుమారుడు, మాజీ ఎంపీటీసీ గేదెల వెంకటరమేష్, కోడలు సర్పంచ్ గేదెల రాధికలను ఈ సందర్భంగా రాజన్నదొర ఓదార్చారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం

సాలూరు: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 28 ఆఖరు తేది అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 29న ప్రభుత్వ కళాశాలల్లో, ప్రైవేట్ కళాశాలలకు దరఖాస్తుచేసుకున్నవారికి ఈ నెల 30న ఆ ప్రైవేట్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052508903,8886789002 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అప్పయ్యపేటలో కేస్ట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్



కేస్ట్ సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో బుధవారం సాయంత్రం పార్వతీపురం సబ్‌కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి కేస్ట్ సర్టిఫికెట్‌పై వచ్చిన అభియోగాలపై పత్రాలను తనిఖీ చేశారు. ఈ మేరకు గతంలో ప్రభుత్వం సుమోటోగా పంపిణీ చేసిన కేస్ట్ సర్టిఫికెట్స్‌పై వస్తున్న అభియోగాలను నివృత్తి చేయడానికి ఇప్పటికే సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్న విషయమై పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో ఎం.సింహాచలం. పాల్గొన్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి పరిశీలించి వనరులు, సేవల రికార్డులను తనిఖీ చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్‌కుమార్

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని మిర్తివలసలో శ్రీ శ్రీనివాస నేచురల్స్ బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ వద్ద విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన బీఆర్‌సీ యజమానులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్ల తక్కువ పెట్టుబడి, నాణ్యమైన పంట దిగుబడి, రసాయన ఎరువుల వినియోగం తక్కువగా ఉంటాయన్నారు. పలుపత్ర ద్రావణాలను, బ్రహ్మాస్త్రం, ఎగ్ ఏమైనో యాసిడ్, చేపల ద్రావణం, జీవామృతాలు వంటి ఇన్‌పుట్ తయారీలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. వాటిని తయారుచేసి పంటలకు వినియోగిస్తే మంచి నాణ్యమైన పంట వస్తుందన్నారు. కార్యక్రమంలో రైస్ ప్రాజెక్ట్ మేనేజర్ మన్మోహన్, కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ లక్ష్మి, తిరుపతిరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మధ్యతరగతి అవసరాలపై కేంద్రం దృష్టి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి, అధికారులు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని బలహీన వర్గాలు, మధ్యతరగతి కుటుంబాల అవసరాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో గల పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం అంగీకార్ అమలుపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధానంపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని పేర్కొన్నారు. పట్టణ గృహ నిర్మాణంలో స్థోమత, స్థిరత్వంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 పట్టణ ప్రజల విభిన్న గృహ అవసరాలను తీర్చడానికి రూపొందించిన నాలుగు పద్ధతుల ద్వారా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అంగీకార్ 2025 కరపత్రికలు, వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ కమిషనర్, ఏపీ టిడ్కోపీడీ, గృహ నిర్మాణ సంస్థ డీఈ, బీఎల్ సీ, ఏహెచ్‌పీసీ ఎల్టీసీలు, ఎమినిటీ సెక్రటరీలు, జిల్లా సీఎల్టీసీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

36 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులకు ఎరువుల కొరత నివారణకు చర్యలు చేపట్టినట్లు ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బూర్జ, సీతానగరం గ్రామాల్లో ఉన్న లైసెన్స్‌డ్ ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూర్జలోని నాయుడు ఫెర్టిలైజర్స్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ వరిసాగు, ఇతరపంటలకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని తెలిపారు. బూర్జలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విజయరామ గజపతి, నాయుడు ఫెర్టిలైజర్స్‌లో 24 మెట్రిక్ టన్నులు బగ్గందొరవలస 12 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని చెప్పారు. వ్యవసాధికారుల అనుమతులు లేకపోయినా, అధిక ధరలకు విక్రయాలు జరిగినా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే మరో రెండురోజుల్లో అన్ని గ్రామాల రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టామని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా చదవాలని ఎంఈఓ–1సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పర్యవేక్షించి పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి సంప్రదించి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు చదవాలని చెప్పారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో సబ్జెక్టుల వారీగా ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఇంటివద్ద కనీసం రెండు గంటల పాటు చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలను, అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు, స్టాఫ్ సెక్రటరీ నారాయణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



పశువులకు వ్యాధినిరోధక వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని పాడి పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది వేస్తున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని రైతులు వినియోగించు కోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుడ్డిపేటలో పశువైద్య సిబ్బంది బుధవారం పశువులకు వేస్తున్న నోటిసంచులు, కాళ్లసంచల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 15వ తేదీనుంచి 18వ తేదీ వరకూ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో టీమ్‌లుగా ఏర్పడి పశువులకు టీకాలు వేస్తారన్నారు. ఇంకా ఒకే రోజు ఉండడంతో పాడిరైతులు పాలం పనులకు ఉపయోగించే పశువులకు వ్యాక్సిన్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత బకాయిలు చెల్లించాలి

పార్వతీపురం టౌన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ మన్యం జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా సీపీఎస్ ఉద్యోగులకు రావలసిన బకాయిలు పీఆర్సీ, డీఏ ఎరియర్స్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెరుగైన పీఆర్సీ తో పాటు పాత బకాయిలు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఈ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన హక్కులను వాయిదా వేయడం తగదని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని అన్ని బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.